క్లుప్తంగా

పారిశుధ్యం మెరుగు పరచండి

నింద్ర: అతిసారం, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు పరచాలని ఎంపీడీఓ శివప్రసాద్‌వర్మ ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు సమావేశం నిర్వహించి ఎంపీడీఓ మాట్లాడారు. గ్రామాల్లో తాగునీరు సరఫరా చేసే ఓవర్ హెడ్ ట్యాంకులు ప్రతి 15 రోజులకోసారి శుభ్రం చేయాలని, అలాగే నీళ్ల నింపిన ప్రతిసారీ క్లోరినేషన్ చేసి సరఫరా చేయాలన్నారు.

ఆదర్శ పాఠశాలకు బీరువా వితరణ


బీరువా అందజేస్తున్న రాజేంద్రరావు

విజయపురం: మండలంలోని శ్రీహరిపురం ఆదర్శ పాఠశాలకు పూర్వ విద్యార్థి రాజేంద్రరావు సోమవారం బీరువాను ప్రధానోపాధ్యాయుడు వెంకమరాజుకు అందజేశారు. విద్యార్థులు చదువుల్లో రాణించడంతోపాటు నైతిక విలువలు కలిగి ఉండాలని రాజేంద్రరావు అన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ జయదేవరాజు, ఉపాధ్యాయులు సూరలక్ష్మి, సురేష్, సుజాత, గ్రామస్తులు సురేష్, గజేంద్ర, వినీత తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా పారిశుద్ధ్యం పనులు


ఆలపాకంలో పారిశుద్ధ్య పనులు

విజయపురం: మండలంలోని ఆలపాకంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు అక్కడక్కడా పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో ఆలపాకం సర్పంచ్ బాబు, వైద్య సిబ్బంది పర్యవేక్షణలో సోమవారం తొలగించారు. వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. మురుగు కాలువల్లో ఆయిల్ బాల్స్ వేశారు. చేతిపంపు, నీటి కొళాయి వద్ద అపరిశుభ్రంగా లేకుండా చర్యలు తీసుకున్నారు. అనంతరం పారిశుద్ధ్య పనులపై ప్రజలకు అవగాహన కల్పించారు. పొడి, తడి చెత్తను వేరు చేసి గ్రీన్ అంబాసిడర్లకు ఇవ్వాలని, అలాగే ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

హుండీ కానుకల లెక్కింపు


కానుకలను లెక్కిస్తున్న టీటీడీ సిబ్బంది

కార్వేటినగరం: మేజర్ పంచాయతీ కార్వేటినగరం ప్రసిద్ధి రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ హుండీ కానుకలను లెక్కించగా ఆదాయం రూ.1,060622 వచ్చినట్లు టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. సోమవారం వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం టీటీడీ సిబ్బందితో ఆలయ ఆవరణలో పరకామణి నిర్వహించారు. హుండీ ద్వారా వచ్చిన ఆదాయాన్ని టీటీడీ ఖజానాలో జమ చేస్తామన్నారు. అదేవిధంగా మండల పరిధిలోని ఆళత్తూరు గ్రామంలో వెలసిన వరద వేంకటేశ్వర స్వామి ఆలయంలో కూడా హుండీ కానుకల రూపేణా రూ.2240 ఆదాయం వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ లేఔట్లలో హద్దు రాళ్లు తొలగింపు


హద్దు రాళ్లను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

పుత్తూరు: పుత్తూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 24-3బి1, 29-9బి2, 29-10లోని 2.16 ఎకరాల్లోనూ, వినాయకపురం గ్రామం వద్ద సర్వే నంబర్ 80/5లో వేసిన అనధికార లేఔట్లలో సోమవారం మున్సిపల్ అధికారులు హద్దు రాళ్లను తొలగించారు. కమిషనర్ మంజునాథ్‌గౌడ్ మాట్లాడుతూ, అనధికార లేఔట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం గత జూలైలో జీఓ నంబర్ 134 జారీ చేసిందన్నారు. అయితే క్రమబద్ధీకరణకు ఇప్పటికీ దరఖాస్తు చేయని అక్రమ లేఔట్ల యజమానులపై చర్యలకు ఉపక్రమించినట్లు చెప్పారు. ఇకనైనా లేఔట్ల క్రమబద్ధీకరించుకోవాలని లేనిపక్షంలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయమని, అలాగే ఎలాంటి మౌలిక వసతులు కల్పించమని తేల్చి చెప్పారు.

రైతు సేవలు బహు దూరం

రైతాంగ సంక్షేమానికీ ప్రాధాన్యత ఇస్తామన్న కూటమి ప్రభుత్వం చేతల్లో దీనికి పూర్తిగా భిన్నంగా వ్యవహరిస్తోంది. అరకొరగా అందుతున్న ప్రభుత్వ సేవలను కూడా రైతు సేవా కేంద్రాల విలీనంతో వారికి దూరం చేస్తోంది. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చిన ప్రభుత్వం ఇప్పుడు ఏకంగా వాటిని కూడా సూక్ష్మ విలీనం బాట పట్టిస్తోంది. సమీప గ్రామాల్లోని కేంద్రాల్లో కలిపేస్తోంది. దీంతో వరకూ గ్రామంలోనే అరకొరగా అయినా పొందుతున్న సేవలకు ఇక పొరుగు, దూర ప్రాంతాల్లోనే కేంద్రాలకు వెళ్లాల్సిన దుస్థితి కలగనుంది.


విజయపురం రైతు సేవా కేంద్రం

- విలీనం పేరుతో రైతు సేవా కేంద్రాల కుదింపు
- పనిభారం తప్పదని ఆందోళన చెందుతున్న వీఏఏలు
- విత్తనాలు, ఎరువుల కోసం రైతులకు ఇక కష్టాలే!

రైతు సేవా కేంద్రాల వివరాలు		
మొత్తం రైతు సేవా కేంద్రాలు	:	59
విలీనం చేసినవి	:	28
ప్రస్తుతం ఉన్న సేవా కేంద్రాలు	:	31

నగరి: రైతులు వారి గ్రామాల్లోనే ఎరువులు, విత్తనాలు తీసుకునేందుకు, ఇతర సమస్యలు పరిష్కరించుకోవడం కోసం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామ సచివాలయాల పరిధిలో రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. వాటి ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు పంపిణీ చేసిది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీటి పేరు మార్చేయడంతోపాటు ఏడాదిగా రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కాలంలో రైతు సేవా కేంద్రాలను నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేసిన కూటమి ప్రభుత్వం వాటి సంఖ్యను తగ్గించేసింది. నగరి నియోజకవర్గంలో 59 రైతు సేవా కేంద్రాలున్నాయి. విలీనం పేరుతో 28 రైతు సేవా కేంద్రాలను మరో రైతు సేవా కేంద్రాల్లోకి కలిపేయడంతో ప్రస్తుతం వీటి సంఖ్య 31కి పడిపోయింది.

ఈ-క్రాప్ ఆధారంగా విలీనం

విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ చేసిన ఈ-క్రాప్ బుకింగ్‌లను ప్రామాణికంగా తీసుకొని రైతు సేవా కేంద్రాలను విలీనం చేసినట్లు తెలుస్తోంది. గ్రామాల్లో ఈ-క్రాప్ బుకింగ్ చేసిన విస్తీర్ణానికి, పూర్తి విస్తీర్ణానికి వ్యత్యాసం ఉంటుందని, అలాంటప్పుడు దాన్ని ప్రామాణికంగా ఎలా తీసుకుంటారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఇక పనిభారం మోత

వీఆర్వోలు, సర్వేయర్లను మాత్రం సచివాలయాల వారీగా అలాగే ఉంచి కేవలం తమను మాత్రమే విలీనం చేయడం సరికాదని వీఏఏలు వాపోతున్నారు. విలీనం చేసిన నేపథ్యంలో మిగిలిన వీఏఏలను ఇతర జిల్లాలకు బదిలీ చేస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ-క్రాప్ ఆధారంగా రైతు సేవా కేంద్రాలను విలీనం చేసి తిరిగి ఇప్పుడు ఏరియా మొత్తాన్ని ఈ-క్రాప్ చేయమని చెబుతుండటంతో పనిభారం పెరుగుతుందని లబోదిబోమంటున్నారు.

రైతాంగ సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం


కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులు అన్ని విధాలా ఇబ్బందులు పడుతున్నారు. రైతు సేవా కేంద్రాలను విలీనం పేరుతో తగ్గించడమే కాక రైతులకు అవసరమైన ఎరువులను అందించడంలో విఫలమైన ప్రభుత్వం వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోంది.
–నాగభూషణం, రైతు, నాగరాజకుప్పం

విత్తనాలకు, ఎరువులకు ఇక కష్టాలే


మా ఊరిలోని రైతు సేవా కేంద్రాన్ని తొలగించి సుమారు రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న ఎం.కొత్తూరులో విలీనం చేశారు. ఎరువులు, విత్తనాలు తెచ్చుకోవాలంటే దూరమవడంతో పాటు రవాణా ఖర్చులు అధికంగా అవుతాయి. ఒక బస్తాకు రూ.30 చొప్పున అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోంది. ఏదైనా సమస్య వచ్చి వ్యవసాయ శాఖ సిబ్బందిని అడగాలన్నా ఇబ్బంది పడాల్సి వస్తోంది.
–రవికుమార్, సర్పంచ్, బుగ్గ అగ్రహారం

ఎరువులు, యూరియా పంపిణీలో పచ్చనేతలకే ప్రాధాన్యత


రైతు సేవా కేంద్రాలు కుదించడమే కాక అక్కడికి సరఫరా చేసే యూరియా, ఎరువుల పంపిణీలోనూ అధికారులు పచ్చనేతలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నేతలకు ఎకరాకు ఒక బస్తా ఎరువు ఇస్తే, పచ్చ నేతలకు ఎకరాకు ఐదు బస్తాలు ఇస్తున్నారు. ఇలా మునుపెన్నడూ జరగలేదు.
– రాజగోపాల్, రైతు, బూదివానెత్తం, విజయపురం మండలం

వినతులపై దృష్టి పెట్టండి


అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ లోకనాథపిళ్లై

శ్రీరంగరాజపురం: ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చే ప్రజా సమస్యల వినతులపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్ లోకనాథపిళ్లై అన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కార వేదికలో 9 వినతులు రాగా.. అందులో మ్యుటేషన్ 3, దారి సమస్య 4, రేషన్‌కార్డు 2 వంటి సమస్యలపై అర్జీలు వచ్చాయని తెలిపారు. వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. రెవెన్యూ సమస్యలు, ధ్రువపత్రాల మంజూరు జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమానికి రెవెన్యూ సిబ్బంది, అర్జీదారులు పలువురు పాల్గొన్నారు.

లక్ష్మీపతిరాజుకు సతీ వియోగం


గీత (ఫైల్)

విజయపురం: మండలంలోని శ్రీహరిపురం ఎంపీటీసీ, రాష్ట్ర క్షత్రియ సేవా సంఘం ఉపాధ్యక్షుడు డి.లక్ష్మీపతిరాజు భార్య డి.గీత (63)సోమవారం మృతి చెందారు. కొన్ని రోజులుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతూ తన స్వగ్రామమైన నెహ్రూనగర్‌లో తుది శ్వాస విడిచారు. పలువురు రాజకీయ నాయకులు, అధికారులు సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు బంధువులు తెలిపారు.

బస్సు నుంచి జారి పడి వ్యక్తికి గాయాలు




బస్సు ఫుట్‌బోర్డుపై నుంచి పడి చికిత్స పొందుతున్న మమూద్, ప్రయాణికులతో కిక్కిరిసిన బస్సు

కార్వేటినగరం: బస్సు నుంచి జారి కింద పడిన వ్యక్తికి గాయాలైన సంఘటన కార్వేటినగరం మండపం వీధిలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పాఠశాలలు, కళాశాలల నుంచి విద్యార్థులు బస్సు కోసం ఎదురు చూస్తున్న తరుణంలో పుత్తూరు నుంచి చిత్తూరుకు వెళ్లే ఆర్టీసీ బస్సు స్టాపింగ్‌కు చేరుకోవడంతో విద్యార్థులు, అక్కడ ఉన్న ప్రయాణికులు ఎక్కారు. అయితే బస్సులో ఖాళీ లేకపోవడంతో శ్రీరంగరాజపురం మండలం దిగువముద్దికుప్పం గ్రామానికి చెందిన మమూద్(40)తోపాటు కొందరు ఫుట్‌బోర్డుపై నిలబడ్డారు. బస్సు సుమారు 200 మీటర్ల వరకు వెళ్లింది. ఈ క్రమంలో ఫుట్‌బోర్డుపై ఉన్న మమూద్ కాలు జారి రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని వెంటనే ఓ ప్రైవేటు వాహనంలో స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదనపు బస్సులు నడపాలి

స్కూళ్లు, కళాశాలలు వదిలే సమయానికి అదనపు బస్సులు నడపాలని విద్యార్థులు, ప్రయాణికులు డిమాండ్ చేశారు. అదేవిధంగా 4, 5 గంటల సమయంలో బస్సులు లేక దూర ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులు బస్సుల కోసం ఎదురు చూడాల్సి వస్తోందని, ఆర్టీసీ అధికారులకు అనేకసార్లు వినతులు ఇచ్చినా పట్టించుకోవడం లేదంటున్నారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య అదనంగా బస్సు సర్వీసు ఏర్పాటు చేసి విద్యార్థులు సకాలంలో తమ గమ్యానికి చేరుకునేలా చూడాలని కోరారు.

రైతు పోరుకు తరలిరండి

వెదురుకుప్పం: రైతులు అవస్థలు పడుతున్న నేపథ్యంలో మంగళవారం చేపడుతున్న రైతు పోరుబాటకు మండలంలోని వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, రైతులు పెద్దఎత్తున తరలిరావాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని పలువురు నాయకులు, కార్యకర్తలు కొత్తపల్లెమిట్ట వద్దకు మంగళవారం ఉదయం 9 గంటలకు చేరుకోవాలని సూచించారు. పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. అక్కడి నుంచి చిత్తూరు ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రాలు సమర్పించాలని తెలిపారు.


అధ్యాపకులను సన్మానం చేస్తున్న విద్యార్థులు

ఘనంగా గురుపూజోత్సవం

పాలసముద్రం: మండలంలోని పాలసముద్రం ప్రభుత్వం జూనియర్ కళాశాలలో సోమవారం ప్రిన్సిపల్ హేమలత ఆధ్వర్యంలో గురుపూజోత్సవం ఘనంగా జరుపుకున్నారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రిన్సిపల్ హేమలత మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మన దేశానికి అందించిన సేవలు ఎనలేనివన్నారు. ఒక విద్యార్థి వ్యక్తిత్వాన్ని, సామర్థ్యాన్ని, భవిష్యత్తును తీర్చిదిద్దే సర్వోన్నత వ్యక్తి ఉపాధ్యాయుడు అన్నారు.

అట్టహాసంగా నిమజ్జనం


గణేషుని నిమజ్జనానికి తరలిస్తున్న గ్రామస్తులు

పాలసముద్రం: మండలంలోని ఆముదాల పంచాయతీ కొత్తకండ్రిగ గ్రామంలో సోమవారం వినాయకుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి అట్టహాసంగా నిమజ్జనం చేశారు. వినాయక చవితిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన విగ్రహానికి ప్రతిరోజు పూజలు నిర్వహించారు. సోమవారం గ్రామంలోని యువకులు, మహిళలు నిమజ్జనం సందర్భంగా రంగుల చల్లుకుంటూ నృత్యాలు చేస్తూ గ్రామానికి సమీపంలో ఉన్న చెరువుల్లో వినాయకుడి ప్రతిమను నిమజ్జనం చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన


రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న ఏఓ డిల్లీప్రసాద్

పాలసముద్రం: మండల పరిధిలోని రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ఏఓ డిల్లీప్రసాద్ తెలిపారు. సోమవారం శ్రీకావేరిరాజుపురం రైతు సేవాకేంద్రంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో చెరకు సాగు చేసి అందులో వస్తున్న బెల్లాన్ని తిరుపతి-తిరుమల దేవస్థానం తీసుకోవడానికి సిద్ధంగా ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయం పద్ధతి ప్రకారం విత్తనం నుంచి విత్తడం వరకు ద్రవ, ఘన జీవామృతం, కషాయాలతో పండించే విధానంపై అవగాహన కల్పించారు. రైతులకు ఇంటి పరిసరాల్లో కిచెన్ గార్డెన్ గురించి వివరించారు. వరిపంటను ఆశించే చిన్న చిన్న తెగుళ్ల నివారణకు పేడ, ఇంగువతో చేసిన ద్రావణం వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలి మహేష్‌బాబు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్‌కు స్పందన


పింక్ బస్ వైద్య బృందం

పుత్తూరు: పరమేశ్వర మంగళం పీహెచ్‌సీ వద్ద సోమవారం స్విమ్స్ బృందం నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు మంచి స్పందన లభించింది. తొలుత క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, ముందస్తు నివారణ చర్యలపై శిబిరంలో అవగాహన కల్పించారు. అనంతరం పింక్ బస్సుల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. రక్తపోటు, మధుమేహం పరీక్షలతో పాటు మహిళలకు నోరు, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. రూ.7 వేల నుంచి రూ.10 వేల వరకు నిర్ధారణ పరీక్షలకు ఖర్చు అవుతుందని, అలాంటిది ఉచితంగా శిబిరంలో చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో స్విమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ నాగరాజ్, నోడల్ ఆఫీసర్లు డాక్టర్లు ప్రత్యూష, లలిత్, వైద్యాధికారి డాక్టర్ సాయిచరణ్, స్విమ్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చైతన్యభాను, స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.హేమభూషణ్‌రెడ్డి, సర్పంచ్ మల్లిక, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు. వడమాలపేట ఎంపీడీఓ కార్యాలయం వద్ద పింక్ బస్ సేవలు అందజేశారు. అక్కడ కూడా మహిళలు పరీక్షలు చేయించుకున్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

మామిడిని నరికేస్తున్నారు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం తుమ్మింద గ్రామ పరిసరాల్లో వేలాది ఎకరాల్లో సాగులో ఉన్న మామిడి చెట్లను నరికేస్తున్నారు. దీంతో విస్తీర్ణం గణనీయంగా తగ్గుముఖం పడుతోంది. నరికేసిన చెట్లను ముక్కలు..ముక్కలుగా చేసి లారీల్లో తరలిస్తున్నారు.

సస్యరక్షణ చర్యలు తీసుకోండి

నింద్ర: మండలంలో పంటలకు ఆశించే చీడపీడల నివారణకు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి తులసీరాం రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని జీఎస్ కండ్రిగ, ఇరుగువాయిలో వేరుశనగ పంటలను ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు సస్యరక్షణ తప్పనిసరిగా పిచికారీ చేయాలని కోరారు. వర్షాలు కురుస్తుండడంతో పంటలకు పచ్చపురుగు, లద్దెపురుగులు ఆశిస్తున్నాయని, వీటి నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులే


బాలాజీని సత్కరిస్తున్న జెడ్పీటీసీ సుకుమార్

వెదురుకుప్పం: సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులేనని జెడ్పీటీసీ సుకుమార్ అన్నారు. సోమవారం వెదురుకుప్పంలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఘనంగా సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురుతర బాధ్యతలను మరువకూడదన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలన్నారు. ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేయడంతో పాటు విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించి మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన పరమాత్మయ్యను సత్కరించారు. కార్యక్రమంలో డీవైఈఓ మహేశ్వరరావు, ఎంఈఓ దామోదరం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి



శ్రీరంగరాజపురం: రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలోని చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారి మంగుంట వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని పెద్దతయ్యూరుకు చెందిన ఖాదర్‌బాషా పెద్ద కుమారుడు వశ్రీం(4) 49కొత్తపల్లిమిట్ట నుంచి తన తండ్రితో కలసి స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో వస్తుండగా అదుపు తప్పి వశ్రీం రోడ్డుపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం చిన్నారి వశ్రీం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

కాణిపాకం అభివృద్ధికి ప్రతిపాదనలు

కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో టీటీడీ కల్యాణ మండపం, విశాంత్రి భవనం నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడుకు ఎమ్మెల్యే మురళీమోహన్, ఈఓ పెంచల కిషోర్ అందజేశారు. వారు సోమవారం ఆయనను కలిసి అభివృద్ధిని వివరించారు. దీనిపై చైర్మన్ సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు.

అన్నదాతలకు న్యాయం చేయడానికే పోరు


పుత్తూరులో అన్నదాత పోరు పోస్టర్లను విడుదల చేస్తున్న పార్టీ నాయకులు


నగరి: అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

- నగరి ఆర్డీఓ కార్యాలయం ఎదుట నేడు ఆందోళన
- పోస్టర్లు విడుదల చేసిన వైఎస్సార్ సీపీ నాయకులు

నగరి: రైతన్నలకు న్యాయం చేయడానికే అన్నదాత పోరు కార్యక్రమాన్ని పార్టీ ఆదేశాలతో నిర్వహించ తలపెట్టినట్లు మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం తెలిపారు. సోమవారం మాజీమంత్రి ఆర్కే రోజా నివాస కార్యాలయం వద్ద ×అన్నదాత పోరు₹ పోస్టర్లను పార్టీ నేతలతో కలిసి ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. యూరియా కొరత, రైతాంగ సమస్యలపై ఆందోళనకు పార్టీ పిలుపునిచ్చిందన్నారు. మంగళవారం బస్టాండు ప్రాంగణంలోని మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలదండలు వేసి అక్కడి నుంచి వెళ్లి ఆర్డీఓ కార్యాలయం ఎదుట శాంతియుతంగా ఆందోళన చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15నెలల్లో గత సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధిని కక్ష పూరితంగా విధ్వంసం చేయడం తప్ప చేసిందేమీ లేదని విమర్శించారు. మండల పార్టీ అధ్యక్షుడు తిరుమల రెడ్డి మాట్లాడుతూ, రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను ప్రభుత్వం అరకొరగా సరఫరా చేస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అంతేకాకుండా రైతు సేవా కేంద్రాలుగా మార్చిన రైతుభరోసా కేంద్రాలను కుదించి విలీనం చేస్తోందని మండిపడ్డారు. మరోవైపు పంటలకు గిట్టుబాటు ధరల్లేక రైతన్నలు నష్టాలపాలవుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. అందుకే రైతాంగం తరఫున పోరాటానికి పూనుకున్నామని, దీనిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ పార్టీ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, ఉపాధ్యక్షులు మునివేలు, వైస్ చైర్మన్ బాలన్, వైస్ ఎంపీపీ ఢిల్లీ, నాయకులు బుజ్జిరెడ్డి, మురుగ, రవికుమార్, కృష్ణమూర్తి, మధు, నాగరాజు, దినకర్ రెడ్డి, అరుణాచలం తదితరులు పాల్గొన్నారు.

రైతుల పక్షాన వైఎస్సార్ సీపీ పోరాటం

పుత్తూరు: అన్నదాతలకు అండగా ఉండాలని పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు మాజీ మంత్రి ఆర్కే రోజా నేతృత్వంలో మంగళవారం నగరి ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేయనున్నట్టు మున్సిపల్ చైర్మన్ హరి తెలిపారు. సోమవారం పుత్తూరులో 'అన్నదాత పోరు' పోస్టర్లను విడుదల చేసి ఆయన మాట్లాడారు. అన్నదాతలకు అండగా ఉండాల్సిన కూటమి ప్రభుత్వ నిరంకుశ వైఖరి అవలంభిస్తోందని, యూరియా పూర్తిస్థాయిలో ఇవ్వకుండా అన్నదాతలను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారని, వారి పక్షాన వైఎస్సార్‌సీపీ నిలిచి ప్రభుత్వంపై పోరుబాటకు సిద్ధమైందన్నారు. మంగళవారం నగరిలో నిర్వహించ తలపెట్టిన అన్నదాత పోరులో పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జయప్రకాష్, ఎంపీపీ మునివేలు, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఏకాంబరం, నాయకులు దిలీప్‌మొదలి, సుబ్రమణ్యం, మనోహర్‌రెడ్డి, బాలాజి, చక్రపాణి, చిరంజీవి, మురళీరెడ్డి, గోపి, జయబాబు, గిరిజాప్రసాద్, మునయ్య పాల్గొన్నారు.